# అమ్మలూ! నువ్వు నా దగ్గరకు రావద్దులే!

కొంపెల్ల విశ్వం



**సుమతి** చనిపోయింది. ఆ కట్టె కట్టెల్లో కాలి మసై పోయింది. సుమతి పోయినా, ఆమె ప్రాణంలేని శరీరం కాలి బూడిదై పోయినా ఆమెకు సంబంధించిన జ్ఞాపకాలూ, అనుభూతులూ రఘురామ్‌ని వదిలి పెట్టి పోలేదు. పోవేమోకూడా!

మనుషులు పోయినా, మనసులు పోవు. వాటి మమతలు పోవు. మరణం దేహానికే తప్ప ఆత్మకు కాదు. మనసుతోటి మన సెప్పుడూ కలిసి ఉంటదీ, చావు పుటుక లేనిదమ్మ నేస్తమన్నదీ.

సుమతి, రఘురామ్ సుమారు పది సంవత్సరాల క్రితం పెళ్ళి చేసుకున్నారు. వాళ్ళిద్దరిదీ కులాంతర వివాహం. అయితే ఆదర్శం కోసమో, కులాంతర వివాహం చేసుకున్నాం అనే పబ్లిసిటీ కోసమో వాళ్ళు ఆ పెళ్ళి చేసుకోలేదు.

వాళ్ళిద్దరూ ఒకరి నొకరు కావాలనుకున్నారు. అందుచేత ఇద్దరూ వేరువేరు కులాలవాళ్ళైనా పట్టించుకోలేదు. కాదు—పట్టించుకుని పెళ్ళి చేసుకోవడం మానలేదు. కానీ, వాళ్ళ ఇళ్ళలో వాళ్ళు మాత్రం ఈ జంట గురించి బాగా పట్టించుకున్నారు.

'ఇలా పెళ్ళి చేసుకున్నాం' అంటూ ఉత్తరాల ద్వారా తెలిపిన తరువాత పెద్దవాళ్ళ దగ్గరినుంచి కొంత కాలంపాటు ఆశీర్వాదం కానీ, తిట్టుకానీ ఏదీ లభించలేదు. సుమతి కొంచెం నొచ్చుకుంటే రఘురామ్ అన్నాడు-"కేవలం వయసులో మాత్రమే పెద్దవాళ్ళు పెద్దవాళ్ళవరు. పెద్దమనసున్న వాళ్ళే పెద్దవాళ్ళు. మనం ఏ తప్పూ చేయలేదని మనకు తెలుసు. మనను వాళ్ళు తప్పించుకుని తిరిగితే, మనం చేయవలసిందేమీ లేదు. పిల్లలకు పెద్దవాళ్ళ అవసరం ఎంత ఉంటుందో, పెద్దవాళ్ళ క్కూడా పిల్లల అవసరమూ అంతే ఉంటుందని పెద్దవాళ్ళుకూడా తెలుసుకోవడం మంచిది. అందుచేత ఈ విషయం గురించి ఆలోచించి నీ బుర్ర పాడు చేసుకోకు."

మరో నెల రోజులు గడిచిపోయాక, రఘురామ్ వాళ్ళ ఇంటి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. "జరిగిందేదో జరిగిపోయింది. నీకు వీలు కుదిరితే, ఆ అమ్మాయిని తీసుకుని ఓసారి ఇక్కడకు రా. ఏమిటో నిన్ను మనింటి ఆఖరివాడిగా పుట్టించి భగవంతుడు మేలే చేశాడని మేమందరం అనుకుంటున్నాం. లేకపోతే మనింట్లో ఎవరికీ పెళ్ళిళ్ళు అయ్యేవి కావేమో బహుశా. అప్పుడప్పుడు నీ క్షేమసమాచారాలు తెలియజేస్తూ ఉండు"అంటూ రఘురామ్ వాళ్ళ విధవక్కగారు ఉత్తరం రాసింది. సుమతి బాధపడితే అన్నాడు రఘురామ్-"ఏ ఉత్తరమూ రాయని నీ అమ్మే చాలా నయం ఇలాంటి వెధవ ఉత్తరాలు రాసిన మా అక్క కంటే."

కానీ, సుమతి తల్లికూడా రఘురామ్ అక్కకన్నా తక్కువదేమీ కాదనీ, మరో రెండు ఆకులు ఎక్కువ చదివిందేననీ చాలా తొందరగా రుజావు చేసుకుంది. కాదు అలా రుజావు చేసుకునే అవకాశాన్ని వీళ్ళే ఆమెకు ఇచ్చారు.

సుమతికి ఆరు నెల్లు పూర్తయ్యాయి. ఆడతోడు, ముఖ్యంగా తల్లి అవసరం తెలిసిన సుమతి తల్లికి ఉత్తరం రాసింది. రఘురామ్‌కూడా కాదనలేదు. పది రోజులు పోయాక, సుమతి తల్లి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. "నీకు పెళ్ళైందనే మన ఊళ్ళో చాలామందికి తెలీదు. ఇప్పుడు కడుపేసుకుని ఇక్కడికి వస్తే నలుగురూ నాలుగు విధాలుగా అనుకుంటారు. నీ ఆరోగ్యం జాగ్రత్త!" ఆ ఉత్తరం చదివి వెక్కి వెక్కి ఏడ్చింది సుమతి.

రఘురామ్ దంపతులుండే ఇంటి వాళ్ళు చాలా మంచివాళ్ళు. ఆడపిల్లకు జీవితంలో 'తొలిసారి గర్భవతి కావడం' అనేది ఒక్కసారే జరుగుతుంది. కాబట్టీ, అప్పుడు మాత్రమే జరిగే శుభకార్యమే సీమంతం కాబట్టీ, రఘురామ్ ఇంటివాళ్ళ సహకారంతో ఆ శుభకార్యం పూర్తిచేశాడు.

సుమతికి ఏదన్నా తినాలని ఉన్నా తనకు చేతనయితే చేసి పెట్టేవాడు రఘురామ్. లేదా మార్కెట్‌నుంచి తెచ్చిపెట్టేవాడు. సుమతికి తొమ్మిదో నెల వచ్చేసరికి వాళ్ళకు మరో ఇబ్బంది ఎదురయింది. ఇంటివాళ్ళకు కావలసిన వాళ్ళెవరో చనిపోవడంతో కుటుంబం కుటుంబం యావత్తూ తరలివెళ్ళారు. పురుటిరోజులు దగ్గర పడుతుంటే రఘురామ్‌కు సుమతి, సుమతికి రఘురామ్ మాత్రమే మిగిలారు. ఓ రోజు సుమతి కడుపులో పోటు వచ్చి మెలికలు తిరిగిపోయింది. "ఒంటరిగా ఏం అవస్థ పడతారు? పోనీ మా అమ్మకు టెలిగ్రామ్ ఇవ్వండి" అంది సుమతి. ఇచ్చాడు రఘురామ్. వచ్చింది సుమతి తల్లి.

సుమతికి వచ్చినవి ఫాల్స్ పెయిన్స్ కావడంతో తల్లి వచ్చేసరికి కుదుటబడి ఆమె నిద్ర పోతోంది. రఘురామ్ ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. ఆ దృశ్యం చూసిన తల్లి వాళ్ళిద్దరిమీదా ఫైరయిపోయింది. అంతకు ముందెప్పుడూ చూసి ఉండలేదేమో, రఘురామ్‌కు ఆమెవరో అర్థం చేసుకోవటానికి కొంచెం టైము పట్టింది. కానీ, ఆమె మాట్లాడే విధానం, భర్త పోయినా, ఆఫీసరుగారి భార్యగా చెలాయించే నోరు ఆమె ఎవరో చెప్పకనే చెప్పాయి.

"గుమాస్తాగాడివి, నువ్వు పెళ్ళి చేసుకుని దాని గొంతు కోశావు. నెప్పులూ లేవు, గిప్పులూ లేవు. నన్ను ఫూల్ చేద్దామనే కదా, టెలిగ్రామ్ ఇచ్చావు" అంటూ రఘురామ్ మీద విరుచుకు పడి సుమతి, రఘురామ్ ఏదో చెప్పబోతూన్నా వినిపించుకోకుండా తనకు భాలా పనులున్నాయని, మరీ అవసరం అనుకుంటేనే టెలిగ్రామ్ ఇవ్వమని చెప్పి వచ్చినట్టే వెళ్ళిపోయింది సుమతి తల్లి.

'స్త్రీ అంటే సహనానికి మారు పేరనీ, తల్లి అంటే కరుణకు ప్రతిరూపం అనీ అంటారు. కానీ ఈవిడేమిటి ఇలా ఉంది? ప్రేమకూ, కరుణకూ ప్రతినిధిలా ఉండే సుమతి నిజంగా ఈ కఠినాత్మురాలి కడుపునే పుట్టిందా' అనుకున్నాడు రఘురామ్.

అతని తల నిమురుతూ అంది సుమతి. "మా అమ్మ గురించేనా ఆలోచిస్తున్నారు? ఆవిడంతే! రెండు రోజులు ఇక్కడుండి నాకేదన్నా తినాలనిఉందేమో వండి పెట్టాలన్న జ్ఞానంకూడా ఆవిడకు లేకపోయింది. చూడండి నన్ను కట్టుకున్న నేరానికి ఎంత కష్టమైనా మీరే పడండి. మాఅమ్మకు మాత్రం కబురు చెయ్యకండి-ఓవేళ పురుట్లో నేను పోయినాసరే!"

"సుమతీ!"

ఓ రోజు రాత్రి రఘురామ్, సుమతి ఇద్దరూ అన్నం తిన్నాక, సుమతి మళ్ళీ కడుపులో నెప్పిగా ఉందంది.

"అలాగా ఓ పది నిమిషాల్లో టాక్సీ తీసుకొస్తాను. కంగారుపడకు"అంటూ సుమతికి చెప్పి తాను కంగారు పడుతూ బయలుదేరాడు రఘురామ్. అతను బయటికొచ్చేసరికి, ఆకాశం పూర్తిగా మబ్బులతో నిండి ఉంది. చినుకులుకూడా ప్రారంభమయ్యాయి. వాళ్ళున్న ఇంటికి మెయిన్ రోడ్‌కి ఓ కిలో మీటరు దూరముంది. వర్షం పెద్దదై తడిసిపోయాడు రఘురామ్. తీరా చూస్తే అక్కడ టాక్సీల్లేవు. ఓ ఆటోలో ఎక్కి, టాక్సీ దొరికేవరకు ఆ ఆటోలో వెళ్ళి, ఆ పైన ఆటో వదిలిపెట్టి, టాక్సీలో ఇంటికి వచ్చేసరికి దాదాపు గంట పట్టేసింది. సుమతిని టాక్సీలో తీసుకుని అలవాటుగా చెకప్ చేయిస్తున్న నర్సింగ్‌హోమ్‌కు వెళ్ళాడు రఘురామ్.

వాళ్ళు ఎడ్మిట్ చేయించుకున్నారు కానీ 'తెల్లారాక గానీ, పురుడు రాదు, మీరు వెళ్ళం'డన్నారు.

రఘురామ్ వాళ్ళు ఎంత చెప్పినా వెళ్ళలేదు. మగవాళ్ళు నర్సింగ్‌హోమ్‌లో ఉండకూడదని కసిరినా ఖాతరు చేయకుండా కారిడార్లోనే ఓ మూల కూర్చున్నాడు. వర్షం ఇంకా పడుతూనే ఉంది. పూర్తిగా తడిసిపోయిన అతను చలికి వణికిపోతూ అలాగే కూర్చున్నాడు. తెలతెలవారుతుంటే సుమతి ఆడపిల్లను ప్రసవించింది. తరవాత అంతా మామూలుగా జరిగిపోయింది. దంపతులు ఇద్దరూ బిడ్డకు 'నవత' అని పేరు పెట్టుకున్నారు. 'అమ్మలూ' అని ముద్దుగా పిలుచుకునేవారు.

అమ్మలుకు అమ్మంటే చాలా ఇష్టం. నాన్నంటే పంచప్రాణాలూను! అమ్మలు పుట్టిన వేళా విశేషమేమిటో గానీ రఘురామ్‌కు ప్రమోషన్ వచ్చి ఆఫీసరయ్యాడు. అల్లుడు ఆఫీసరు అయ్యాడని వచ్చిందో, మనవరాలిని చూద్దామనే వచ్చిందో కానీ, సుమతి తల్లి వచ్చి తల్లీ బిడ్డల్ని చూసి, బాధపడుతున్నట్టుగా ముక్కు చీది వెళ్ళింది. రఘురామ్ అక్క, అన్నయ్య కూడా వచ్చి వెళ్ళారు.

నాలుగేళ్ళు సవ్యంగానే గడిచిపోయాయి. సుమతి మళ్ళీ నెల తప్పింది. వాళ్ళ ఆర్థిక పరిస్థితి మెరుగవడం వల్ల వచ్చీ పోయే వాళ్ళ రాపిడి కూడా పెరిగింది. ఎవరు వచ్చినా ఎవరు వెళ్ళినా మళ్ళీ సుమతి ప్రసవించే సమయానికి సుమతి, రఘురామ్, అమ్మలూ మిగిలారు. ఈసారి పనిపిల్లకూడా ఉంది వాళ్ళకు ఆసరాగా.

సాధారణంగా తొలి కాన్పు కష్టమంటారు. లేదా మూడో కాన్పు కష్టమవుతుందంటారు. కానీ, అదేమిటో, కాన్పు కష్టమై, అతి కష్టంమీద పండులాంటి మగపిల్లాణ్ణి భూమ్మీద పడేసి కన్ను మూసింది సుమతి. కంటికీ, మంటికీ ధారగా ఏడ్చాడు రఘురామ్. ప్రపంచమే శూన్యమైపోయినట్టైందతనికి.

బంధువులు రాబందుల్లా వచ్చి వాలారు. కర్మకాండ యథావిధిగా గోదాన, సువర్ణదాన సహితంగా సాగుతోంది. సుమతికో కొడుకు పుట్టాడు కాబట్టి వాడు మరీ చిన్నవాడు కాబట్టీ, వాడి బదులు యజమానస్య మాతృః'అంటూ తనే కర్మ పూర్తి చేశాడు రఘురామ్. 'రేప్పొద్దున్న తనకేదైనా అయినా ఈ కుర్రాడే సర్వాధికారి' అనుకున్నాడు రఘురామ్.

అంతకుముందే రఘురామ్‌కు మళ్ళీ ప్రమోషన్ మీద మరో ఊరు బదిలీ అయింది. ఏం చేయాలో ఆలోచించేటంత స్తిమితం కూడా అతనికి లేదు. కష్టాల్లో అతన్ని చూట్టానికి వచ్చినవాళ్ళందరూ తలో మాటా చెప్పి, అతన్ని మరింత కష్టపెడుతున్నారు. అయినా పిల్లలతో కొత్త ఊరు వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు రఘురామ్. ఈలోగా జరగరాని ఘోరం జరిగిపోయింది. స్తన్యపానం కుదరక పోవడంతో పోతపాలు పడకనో, తల్లి లేని ఈ లోకం చూసి తల్లడిల్లి పోవడం చేతనో రఘురామ్ వంశాంకురం కన్ను మూశాడు.

రఘురామ్ గుండె ఆగిపోలేదు- అమ్మలు కోసం అది ఇంకా కొట్టుకుంటూనే ఉంది. కానీ, అమ్మలు బాగా బెదిరిపోయింది. పెద్దయితల కొరివి పెడతాడనుకున్న కొడుకునే ఖననం చేసి వచ్చాడు రఘురామ్.

పురుడు పోయటానికి రెండుసార్లు రాని సుమతి తల్లి, అమ్మలును పెంచటానికి ముందుకొచ్చింది- 'నా మనవరాలు' అంటూ. 'ఆడపిల్లకు బోలెడు అవసరాలుంటాయి. మగాడివి నువ్వు ఏం పెంచుతావు' అంటూ సలహాకూడా ఇచ్చింది. చిన్న పిల్లల మనసు మైనపు ముద్ద లాంటిది. కరగబెట్టి ఎందులో పోసినా, దానికే సరిపడినట్టుగా అతుక్కుంటుంది. వాళ్ళు ఏం చెప్పారో, అమ్మలు ఏం విందో తాను అమ్మమ్మ దగ్గిరే ఉంటానంది. అక్కడినుంచి రానని మారాం చేసింది.

"అమ్మలూ! జాగ్రత్తగా అమ్మమ్మ దగ్గిరే ఉంటావా అమ్మా!" అడిగాడు రఘురామ్ కూతురు తల నిమురుతూ.

"ఉంటాను. నేను నీతో వచ్చాననుకో నువ్వు నాకు లాల పోయగలవా? తల చిక్కుదీసి జడేయగలవా మరి" ఆ చిన్న బుర్రలో ఏవేవో ఆలోచనలు. గుండెలకు గట్టిగా అదుముకుని వెక్కి వెక్కి ఏడ్చాడు రఘురామ్.

రఘురామ్ ఆలోచించాడు. సుమతినీ పిల్లలనూ కొత్త ఊరు తీసుకు వెడదామనుకుంటే సుమతి తనకు దూరమైపోయింది. పోనీ పిల్లలను తీసుకు వెడదామనుకుంటే, కొడుకు దూరమైపోయాడు. ఇప్పుడు అమ్మల్ని పట్టుబట్టి తీసుకెళ్ళాలనుకుంటే...? వద్దు! ఆ ఊహే అతని గుండెను పట్టి పిండేస్తున్నట్టుగా ఉంది.

అమ్మల్ని తనివితీరా ముద్దు పెట్టుకుంటూ అన్నాడు-"వద్దు. నువ్విక్కడే ఉండు. అమ్మలూ! నువ్వు నా దగ్గిరకు రావద్దులే! ★


## శ్రేష్ఠమైనవాటినే కొనేవారు ఏరికోరి కొనేవి రాగి అడుగుతోగూడిన కాళీ కాపర్ బాటమ్ స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు.




**ఎందుకంటే కాళీ ఒక్కటే సాటిలేని అనేక అనుకూలతలు సమకూర్చేది**

కాళీ మార్కు 35 సంవత్సరాలకు పైగా స్టెయిన్‌లెస్ స్టీల్ వంట పాత్రల విశిష్టతకు ప్రసిద్ధికెక్కినది; అంతేకాదు, ఈనాడు, రాగి అడుగు గల వంట పాత్రలకు నం. 1 పేరు.

కాళీ కాపర్‌బాటమ్ వంట పాత్రలలో ప్రత్యేక ప్రయోజనాలు.

- **త్వరితమైన వంట:**
  వంటకు పట్టే సమయం 50% తగ్గుతుంది. కారణం, రాగి అన్ని లోహాలకంటే అత్యధిక ఉష్ణవాహక లోహం. (వెండికి మాత్రమే రెండవది.)
- **తక్కువ ఇంధన వినియోగం:**
  తక్కువ మంటతోనే వంటంతా చెయ్యవచ్చు. సర్వత్ర సమానంగా వ్యాపించే వేడివల్ల మంట మచ్చలుగాని, వంటకాలు మాడిపోవడంగాని జరుగదు.
- **మన్నికగల విలువ:**
  గుణగణాల దృష్ట్యా, స్టెయిన్‌లెస్ స్టీలు, రాగి, ఆటుపోట్లతో అణువుగా పరస్పర బంధితం కావడంవల్ల, ఆ రెండిటి మధ్యా విడదీయరాని బంధనం ఏర్పడుతోంది. అంతేగాక, రాగి బంధనం పాత్రయొక్క అడుగు గోడలదాకా వ్యాపించి వుండడంవల్ల మంట- దాని వేడి, రెండూ వంటకు పూర్తిగా ఉపయోగపడుతుందనే హామీ లభిస్తోంది.

గృహిణుల విశ్రాంతికి ఎక్కువకాలం లభిస్తుంది. ఉద్యోగాలు చేసే స్త్రీలకు వంట త్వరగా పూర్తవుతుంది. ప్రతి ఒక్కరికీ-తక్కువ ఇంధనం ఖర్చు, బాగా వండిన వంటకాలు, దీర్ఘకాలపు విలువ.

kali SELECT | నకిలీల విషయంలో జాగ్రత్త! కాళీ ట్రేడ్‌మార్కు వుందా లేదా చూడండి. | kali

విక్రయ ఏజెంటు:
శ్రీ విద్యా ఏజెన్సీస్, కుంభేశ్వరర్ సన్నిధి, కుంభకోణం 612 001
ప్రాంతీయ ఏజంట్లు:
సమ్ము & కో. పోస్ట్‌బాక్సు నం. 3662 ఎమ్.జి రోడ్, ఎర్నాకుళం, కొచ్చిన్ 682011, ఫోన్: 361139
ఈస్ట్ ఇండియా కంపెనీ, 3, అమ్మత లెనర్డ్ రోడ్, (కాళీఘాట్ పోస్టాఫీస్ ఎదుట) కలకత్తా 700 026, ఫోన్: 471540
విక్టరీ మెటల్స్, 101, వేటాకీ మెయిన్ రోడ్, దాండే 400004 ఫోన్: 380075/354507
జె.సి.మాన్ చందా. 15 ఎ/35, [illegible] 110 005, ఫోన్: 562019

GK&E M85.71 Tg.


కథా నిలయం
శ్రీకాకుళం